"అపిదళతివజ్రస్య హృదయమ్"

"బాగా ఆలోచించుకోండి"

"నాకే కాని నీ కక్కర లేదా యేమిటి ఆలోచన?"

"........."

"........."

"కాని కాలం వచ్చి పడింది. మూడే ళ్లయి సమర్తాడిన కోడల్ని పుట్టింట అట్టేపెట్టేసి వూరుకోడం – అపవాదు పుట్టిందంటే మాపుకోలేము సుమండీ"

"తల్లికీ, తండ్రికీ లేని బాధ మనకేం?"

"మనం మాత్రం తల్లిదండ్రులం కామూ యివతలా?"

"అయితే?"

"మన కోడలు–"

"కార్యం అయి మన యింటికి వచ్చీదాకా కోడ లంటే యేమన్న మాట? ఇప్పుడు మనకేమీ పూచీ లేదు, చల్లగా వూరుకో"

"వద్దు సుమండీ! తనువులు శాశ్వతాలు కావు"

"నిజమే"

"మాట కలకాలం వుండిపోతుంది"

"అదీ నిజమే"

"..... ఇంకేం చెప్పగల నమ్మా నేనూ?"

"నువ్వు చెప్పగలగడానికి సందంటూ వుండనిస్తే కాదు టయ్యా నేనూ?"

"........"

"వూరికే దొడదొడ మాట్టాడగానే సరా? లాపాయం టుండాలి–"

"ఇంకా చెప్పుకోవాలి తగుదు నమ్మా అనీ"

"ఏం లోటు వచ్చిందీ?"

"నలుగురూ యేమనుకుంటున్నారో?"

"అనాథ లాగ నేను వియ్యాలవారికి లొంగిపోతే అప్పు డేమనుకుంటారో?"

"ఇ దెక్కడి అభిమాన మండీ?"

"బజార్లో దొరికే రకం కాదిది"

"దొరికినా అక్కర్లేదూ"

"........"

"పోనీ నోళ్లల్లో పడండి"

"నువ్వే పడేశావు నన్నిదివరకేను"

"చూశారా?"

"విన్నావా?"

"........"

"మాట్టాడవేం?"

"రెండో కొడుకు పెళ్లాంతో కాపరం చేసుకుంటూ వుండడమూ, పెద్దకొడుకు అన్నీ వుండీ కూడా ఘోటక బ్రహ్మచారిలాగ–"

"వాళ్లకి మాత్రం లేదూ ఆలోటూ? రెండో కూతురు లక్షణంగా కాపరం చేసుకుంటూ వుండడమూ, పెద్దకూతురు మొగుడు విడిచి పెట్టేసిన దానిలాగ–"

"చాల్లెండి నేర్చుకు పోయారు"

"లాభనష్టాలు నీ కేం తెలుసునూ? భారత భాగవతాలికి అర్థం కూడా చెబుతావు మళ్లీనీ. కాని వోనమాలు రాని వియ్యపురాలు నయం నీకంటేను"

"ఏమిటో ఆనయం?"

"అలా అడిగావు, బాగుంది. విను మరి. ఈ పట్టుదల అంతా రాజమ్మ దంటున్నారు కాని సుందరప్ప దనడం లేదు యెవరూను"

"అయితే?"

"వాడు నిర్భయంగానే తల యెత్తుకు తిరుగుతున్నాడు వీధిలోను"

"తిరిగితే?"

"ఆడది యింటోనే వుండిపోయిాది కనక వీధిలో యెవళ్లే మనుకున్నా లెక్క లేదు. మొగాడు నలుగురిలోకీ వెడతాడు కనక భారం అంతా ఆడది తనమీద వేసుకుంటే–"

"బాగుంది ఆలోచన. మంచి మాటే! ఇప్పటికే ఆడా ళ్లంతా నన్ను పీకేస్తున్నారు"

"రాజమ్మ నెవరూ యేమీ అనరేం?"

"మీరు వింటున్నారా?"

"అంటే మరి మన కిచ్చీది యిచ్చెయ్యదేం?'

"మొండి కెత్తినవాళ్ల నెవ ళ్లేం చెయ్యగలరూ?"

"నువ్వు బండ కెత్తు"

"అదుక్కు తిన్న ట్టుంటుంది"

"......."

"అయితే నా మాట వినరూ?"

"నువ్వు చెప్పిం దేదీ?"

"మనకి కట్నాలూ వద్దు, కానుకలూ వద్దు. అబ్బాయి పెద్ద చదువులు చదివాడు. నెలకి నూరురూపాయలు తెచ్చుకుంటున్నాడు. మన దేనా వోహో అన్న సంసారం కాని మరోటి కాదు. ఏం లోటూ? వొకళ్లు పెట్టలే దనీ, పొయ్యలేదనీ మనకి బెంగెందుకూ?"

"........"

"........"

"తేల్చెయ్యి తొరగాను"

"మన కేమీ వొద్దు. పిల్లని తీసుకువచ్చి కార్యం చేసేసి యిద్దర్నీ చెన్నాపట్టం పంపెయ్యండి"

"ఏడిసిన ట్టుంది నీ సలహా"

"......."

"ఇక మొత్తుకోడం వొక్కటే తరవాయి"

"......"

"మొగుణ్ణి వీధిలో పెట్టిన పీనుగువు, నిన్ను సలహా అడగడం యేమిటి కాకపోతేను?"

"ఇక పరువుకీ, ప్రతిష్ఠకీ నీళ్లు వొదులుకున్నట్టే?"

"పట్టుదల నెగ్గించుకోలేకపోతే యిక పరువంటే యేమిటి, ప్రతిష్ఠ అంటే యేమిటి?"

"వియ్యపురాలితో సమం అవుతారా?"

"తీసిపొమ్మంటావా?"

"ఇంకా యిద్దరు మొగపిల్లలికీ, యిద్దరు ఆడపిల్లలికీ పెళ్లిళ్లూ పేరంటాలూ చేసుకోవాలికూడాను. ఇలా అయితే వాళ్లకి మంచి సమ్మంధాలు తేగలమా?"

"ఇప్పుడీ కట్నపు భూమి వొదులుకుని తెల్ల మొగం వేస్తే తరవాత మూడోవాడికీ, నాలుగోవాడికీ కట్నాలు తేగలమా?"

"ముందు పుచ్చుకునే తర్లి వెడదాం"

"ఇవ్వడం అంటూ వుంటేనా?"

"వులకం!"

"......."

"కాకపోయినా, వీధిలోకి వెళ్ళీ మొగ మనిషికి పట్టూ విడుపూ వుంటాయి. ఆడదానికంటే కనికిష్టం అయితే యిం కేమిటీ చెయ్యడం?"

"........"

"మాట్లాడక నన్నేం వుద్ధరిస్తారా యేమిటి?"

"......."

"మీకు తగిన వియ్యపురాలు దొరికింది. అనుభవించండి"

"......."

"నాదగ్గిర కోతలు కొయ్యడం కాదు ప్రయోజకత్వం"

"......."

"ఆ యాభై సెంట్ల భూమీ వియ్యాలవారి దగ్గిర్నుంచి పుచ్చుకో గలిగితే - కళ్ల కీ రెప్పలు దూరం కావు"

"........"

"తల్లి పెంకితనానికి అక్కడ అ దెంత యేదుస్తోందో, మీ పట్టుదలకి యిక్కడ అబ్బాయి యేం రుసరుస లాడుతున్నాడో - నాకేం?"

"........"

"మీ యిష్టం వచ్చినట్టు చేసుకోండి. ఇక యీ వూసెత్తితే ఛీ అనండి నన్ను"

"రక్షించావు. మాటిమాటికీ యిక నన్ను వేపుకు తినక ఆమాటమీద వుండు"

2

"పోనీ అదలా వుంచు. వియ్యపురాలికీ ఆడపడుచులికీ యివ్వవలసిన లాంఛనాల బాపతు మూడు వందల నలభై యెనిమిది రూపాయలూ యిచ్చేస్తే వాళ్లు యివాళ పిల్లని తీసుకుపోతారు. దీని కేం చెబుతావురా?"

"అదీ వొక దారే"

"అదేం దారండీ గోదారీ? దీక్షితు లన్నయ్యా! ఈపురమాయిం పెవరి దయ్యా?"

"ఎవరి దయితే నీ కెందుకూ?"

"ఇక చెప్పనక్కర్లేదు. తెలిసే పోయింది. వియ్యపురా లెంత యెత్తు యెత్తిందో చూశారుటండీ? ఈవంక పన్ని ముందు తనకీ, తన కూతుళ్లకీ రావలసింది మెల్లిగా లాక్కుంటుంది. తరవాత పిల్లని తీసుకు వెళ్లి కొడుకు నుసికొలుపుతుంది. ఇక పిల్లనీ, మనల్నీ మూడు చెరువుల నీళ్లు తాగిస్తా డా అబ్బాయి! అబ్బో! ఎంత నెరజాణ అయింది వదినా?"

"పాపం ఆవిడ నాతో మాట్లాడనే లేదు యేమీని"

"ఆవిడ నీతో ఎందుకు మాట్లాడాలీ? నేనా యేమిటి వచ్చీ దేమిటో పోయీ దేమిటో ఆలోచించుకోకుండా వడవడ వాగడానికి? మొగుడికి పాఠం చెప్పింది. యేమీ యెరగనట్టు తను అంతఃపురంలో కూచుంది బూబమ్మ లాగ"

"జానకమ్మ నేమన్నా పాపం చుట్టుకుంటుంది"

"అలాగటండీ? పెత్తాత మనమరా లయినందుకు బాగానే పూసుకు వచ్చారు పాపం; అయితే, మీకే గాని ఆవిడకి లే దిలాంటి అభిమానం యెప్పుడూనూ; పోని

గాని, దీక్షితు లన్నయ్యా! లాంఛనాల సొమ్మిచ్చేస్తే యివాళ పిల్లని తీసుకుపోతారన్నావు గదా? అంటే యే మన్నామా టయ్యా?"

"దాల్లో తెలవం దేం వుందీ?"

"తరవాయి మా టేమిటీ? కొంచెం చెబుదూ"

"అంటే?"

"రాకపోకలూ-"

"నేను పూచీ పడలేను"

"అయితే వల్లకాదు"

"ఇలా అట్టేపెట్టుకుంటావా?"

"ఎటు చూసినా చిక్కే వచ్చిం దయ్యా నాకూ. ఇక్కడ పిల్ల గోల పట్టలేకుండా వున్నాను. అక్కడ వారు పట్టు విడవకుండా వున్నారు. తప్పెవరిదో తెలుసుకోకుండా వూళ్లో అమ్మలక్కలందరూ న న్నాడిపోసుకుంటున్నారు చాటునా మాటునానూ"

"నువ్వు మాత్రం పట్టు విడిచిపెట్టావా?"

"వారి కిస్తా మన్నది యివ్వ మన్నాముటయ్యా?"

"ఏమిస్తా నన్నావు, యే మిచ్చావు? ఇచ్చేస్తే యీ తగువు లెందుకూ?'

"యకరమే కాదూ - "

"నీ మొగుడు యకరం నర యిస్తా నన్నాట్ట. ఏమిరా, యిస్తా నన్నావా లేదా?"

"అన్నమాట నిజమే"

"ఆయన మాట లె క్కేమి టయ్యా. అంటే మాత్రం? ఆయన కేం తెలుసునూ? వా ళ్లెంత అడిగితే అంతా యివ్వవలసిందే?"

"మొదటి తప్పు మీదీ, తరవాత తప్పు వాళ్లదీనీ. ఉభయులూ పేచీలకే సిద్ధపడ్డారు"

"మే మేం సిద్ధపడ్డామూ? ఇచ్చెయ్యడాని కిప్పటికీ సిద్ధమే కాదూ?"

"చిన్న కూతురి కెక్కువ యిచ్చి పెద్ద కూతురికి తక్కువ యివ్వడం యేం సబబూ?"

"వాళ్లు వొప్పుకో లేదు టయ్యా మొదటా?"

"అస లేం జరిగిందిరా? బాగా చెప్పు నీ పెళ్లాం యెదటా"

"పెద్ద పిల్లకి యకరం భూమి యిస్తా నన్నాను. వియ్యపురాలి కో నూటపదహార్లూ, ఆడపడుచుల కిద్దరికీ చెరో నూటపదహార్లూ-"

"వందవంద కంటే యెక్కువ యివ్వడానికి వల్లకా దంటే పై పదహార్లు మీ బావ పెట్టారు. యాభై రూపాయలు - మాటలా?"

"వాణ్ణి పూర్తిగా చెప్పనియ్యి"

"దానికి వా ళ్లంగీకరించారు; కాని తరవాత చిన్నపిల్లకి యకరంనర యివ్వవలసివచ్చింది. దాంతో పేచీ వచ్చింది"

"ఎప్పుడు వచ్చిందీ?"

"పెళ్లి వారం వుం దనగానూ"

"వస్తే?"

"మాక్కూడా అలా యిస్తే కాని వల్లకా దని జోగన్న కబు రంపాడు. అందుకు మా మామగారు మాట్టాడకుండా వొప్పుకోమన్నారు"

"వొప్పుకున్నావు"

"అవును"

"తరవాత?"

"తరవాత మా మామగారు యకరమే రాయించి పరమరహస్యంగా రిజిస్టరీ చేయించారు. మూడుమూళ్ళూ పడ్డ తరవాత కట్నం చదివినప్పుడు వాడదేమి టన్నాడు. అంటే,, మొదట అంతే వొప్పన్న మన్నారు మా మామగారు"

"అంటే?"

"ఇం కేం వుందీ? పెళ్లివారు వొక్క పూటయినా భోజనాలికి రాలేదు. పెళ్ళికొడుకు కూడా యే వొకటి రెండు మాట్లో తప్ప మా యింటో భోజనం చెయ్యలేదు. అగ్నిహోత్రాలూ, జరగవలసిన తంతూ మాత్రం – ను వ్వెరగందా యేమిటి అదంతాను?"

"వొక వూరేగింపా, వొక నలుగులా, వొక బంతులాడింపా, వొక సదస్యమా – యేం ముచ్చట్లు తీరాయి అన్నయ్యా మాకు? చిన్నపిల్లకి అన్నీ జరుగుతూ వుంటే పెద్దపిల్ల యింటో యేడుస్తూ – "

"అంత అల్లరి కేనా వొప్పుకున్నావు; గాని అన్న యాభై సెంట్లూ యివ్వనిచ్చావు కాదు నువ్వు నీది శక్తి అంటేను"

"యాభై కాదు, వొక్క సెంటివ్వనివ్వను. నాకు పిసాళం యెత్తుకు వచ్చిం దంటే ఆ లాంఛనాల సొమ్ము కూడా యెగబెట్టిస్తాను. నాపిల్ల నాకు పెద్దకొడుకు కనుకుంటాను"

"కాని ఆ పెద్దకొడుక్కి పెళ్ళాన్ని మాత్రం తెచ్చిపెట్టవు. కదూ?"

"పెట్టి పుట్టందే యెలా వస్తాయీ సుఖాలూ, అందాలూనూ? చిన్నపిల్ల యేణ్ణర్థంనుంచి చిలకలాగ కాపరం చేసుకుంటోంది. పెద్దదాని కర్మం కాకపోతే యిదేమిటీ!"

"ఇంతకీ మీరు మెట్టు దిగకపోతే నీ కూతురికే చిక్కూ, మీకే అప్రతిష్ఠ"

"వా ళ్లెందుకు దిగరూ?"

"దిగారు కారూ? లాంఛనాల సొ మ్మిచ్చేస్తే పిల్లని తీసుకుపోడానికి సిద్ధంగా వుంటేనే వాళ్లు?"

"రాకపోక లుండ వని నువ్వే చెబుతూ మళ్ళీ దిగారు దిగా రంటా వేమి టయ్యా?"

"మీ కంటే దిగారు"

"పెళ్ళిలో ముచ్చట్లూ లేవు, వల్లకాడూ లేదు, యిప్పు డేనా లేకుండా-"

"అంటే?"

"నలుగురూ బిలబిల్లాడుతూ రావడమూ, సలక్షణంగా కార్యం చేసుకోడమూ, పిల్లని పంపుతూ వుండడమూ, అల్లుడువస్తూ వెడుతూ వుండడమూ-"

"ఇక అ వేమీ జాంతే నై. కార్యానిక్కూడా యిక్కడికి రారు. పిల్ల నేనా కట్టుగుడ్డలతో పంపెయ్యాలి. ఏమీ - పసుపూ కుంకుమా-"

"అలా వొక్క నాటికి జరగదు. నా పిల్ల నా యింటోనే వుంటుంది. కన్నవాళ్లం పోషించలేమా యేమిటి దాన్ని?"

"........"

"ఇలాంటి రాయబారం యెలా తెచ్చా వన్నయ్యా నువ్వా?"

"ఏ మంటావురా?"

"ఆయ న్నడిగీ దేమి టయ్యా? ఆయ నేం చెప్పగలరూ? చుట్ట కాలుస్తూ కారాకిల్లీ నములుకుంటూ చీట్లాటలో కూచోడమే; గాని వొక్క దమ్మిడీ తేలేరు. ఇస్తా ననరూ ఆయనా? ఆయన లెక్కేమిటీ? వా ళ్లడిగిం దల్లా అడిగినంతా యిచ్చి మొగపిల్లల్ని పాడుచేసుకోమా?"

"అయితే యిక నేను వెళ్లిపోతాను. ఇంక రెండు నిమిషాలు గడువు. ఈ లోపుగా నేను వెళ్లి ఆపుచెయ్యకపోతే నీఅల్లుడు వెళ్లిపోతాడు. జట్కాలో సామాను వేయుంచుకొని యెక్కడానికి సిద్ధంగా వున్నాడు వాడు. మీరు రాజీకి అంగీకరిస్తే వారంరోజు లుండి, కార్యం చేసుకుని మీ పిల్లని కూడా తీసుకుపోతాడు"

"అంత చెప్పుల్లో కా ళ్లుంచుకొని మాట్టాడితే తేలీదిట్రా యిదీ?"

"రాజీపడ్డా పిల్లని వూళ్లో వుంచడూ? అయితే పొమ్మను. చెన్నాపట్టం వెళ్ళినా సరే శిఖాకోళం వెళ్ళినా సరే యింకా"

"......"

"అబ్బో! ఇలాంటి యెత్తు వేశారూ వియ్యాలవారూ? మహా బాగుంది. ఇక ఆ యాభై సెంట్లే కాదు. లాంఛనాల బాపతు పై పదహార్లుకూడా యివ్వనివ్వను"

"అసలంతా యివ్వనివ్వకపోతే మాత్రం యేమీ?"

"అయితే మూడో మేలు. సొమ్ము చేదా యేమిటి మాకు?"

"పిల్లల సుఖం చేదు; గాని సొమ్ము చేదు కాదు మీకు"

"ఇంచేతే నిన్ను చూస్తే నాకు - ఏమనుకున్నావ్?"

"ఏం?"

"వాళ్లు తిన్న నైన వాళ్ళా?"
"అక్కడ నే నెంత దెబ్బలాడి వచ్చానో యెరుగుదువా నువ్వు?"
"......."
"పెత్తనాలకా యేమిటి బయలుదేరావూ?"
"కాదే?"
"మ రెక్కడికీ?"
"......."
"మాట్డావేమే?"
"ఎందుకే?"
"పో, పో. పిన్నిగా రింటికి మాత్రం రోజూ యెందుకూ?"
"పోతున్నాను"
"......"
"......"
"పోవేం?"
"పోతూంటేనే?"
"......"
"వీధిలోజట్కా ఆగినట్టుం దెవరి దన్నయ్యా?"
"చుట్టాలో స్నేహితులో మరి"
"వెళ్ళి చూడండీ యెవరోనూ?"
"గుమ్మంలోకి వచ్చినవారు లోపలికి రారా యేమిటి?"
"......"
"యెవర్రా?"
"చె-ప్తా"
"......."
"నీ అల్లుడే రోయ్!"
"లోపలకి పోవే. వెళ్లి పోవే. పోవేమే?"
"......"
"నీ కెవరు కావాలి? మీ అమ్మా నేనా?"
"మీరే"
"అయితే నాతో వచ్చేసెయ్యి"
"పదండి"
"......"

"ఎక్కడికే? - ఎక్కడికే? - నీయిల్లు వల్లకాదు - వెనక్కి మళ్లుతావా మళ్ళవే?"

"......"

"చూస్తా రేమండీ? బందిపోటు దొంగలాగ ఫట్టపగలు వచ్చి పిల్ల నలా లాక్కుపోతూ వుంటే నిర్ఘాంతపడి అలా వూరుకుంటా రేమండీ?"

"......"

"బెల్లం కొట్టిన రాయిలాగ మాట్టాడరేమండీ"

"అయ్యో, అయ్యో! బండి కదిలింది వెళ్ళిపోతోంది. మేఘాలమీద యెగిరిపోతోంది. నువ్వే నా అడ్డుకున్నావు కాదేమి టన్నయ్యా?"

"మొగుణ్ణీ పెళ్లాన్నీ విడతియ్య మంటావా?"

"నిన్ననడం యెందుకూ నా వస్తువు మంచిదైతేనూ? ఎక్కడ యేడ్చిపోతుందో అని వెయ్యి విధాల - అందర్నీ వొక యెత్తునా దాన్ని వొక యెత్తునా చూస్తూ వుంటే యెంతపని చేసిందీ విశ్వాసఘాతుకురాలు!"

"....."

"ఇందుకే ఆడాళ్లకి పెట్టడం అంటే నాకు తల నొప్పి"

"చిన్నదానికి పెట్టడం మానేశావా?"

"అది యిలాగే చేసిందా?"

"మీరుమాత్రం దాన్ని యిలాగే చూశారా?"

"పోవయ్యా నేర్చుకున్నావు మాటలూ? ఇక దాన్ని నా యింటికి రానిస్తానా యెప్పుడేనా?"

"వుండగలవా?"

"శరా పట్టా నంటే నా సంగతి నీకు తెలవదు. చూస్తూ వుండు దాని మొఘ మేనా చూస్తా నేమో యింక"

"ఈకభుర్ల కేం లే? మళ్లీ ఈరోజుల్లో నువ్వు చెన్నపట్నం బయలుదేరకపోతే నా చెవి తెగ్గోయించుకుంటాను"

"ఎందుకమ్మా?"

"కూతురికి పురుడు పొయ్యడానికి"

"ఛాల్లేవయ్యా"

"అలాగే నమ్మా? ఇప్పు డలాగే వుంటుంది."

"ఏమయ్యా, అన్నయ్యా! మీ బావకి తీరుబడి లేకపోతే నువ్వేనా కాస్తసాయం కాగూడదుటయ్యా? పిల్ల యెంత కష్టపడుతోందో నయ్యా చేసుకోలేకా. ఎనిమిదో నెల వెళ్లవచ్చిం దయ్యా పాపం! రావయ్యా! నన్నక్కడ దింపేసి క్షణం వుండవద్దయ్యా అక్కడ నువ్వు. ఆరాత్రి మెయిలుకే వచ్చేస్తువు గా నయ్యా" అని అప్పుడు నన్ను చేతులూ కాళ్లూ పట్టుకు బతిమాలకపోతే-"

"అంత బేలపీనుగు ననుకున్నావు టయ్యా నన్నూ?"

"ఆకాశా న్నుంచి వూడిపడ్డావా యేమిటి నువ్వు మాత్రం?

"ఇం కెందుకూ? అయిం దేదో అయిపోయింది. ముందు సంగతి ముందు చూసుకుందాం. ఇప్పటి కింతటితో వూరుకోండి గప్చిప్పుగా"

"మిమ్మల్ని చూస్తే వొళ్లు మండిపోతోందినాకు. మళ్లీ మాట్టాడా రంటే మాట తక్కదు. ఇప్పు డా వేళాకోళాలూ, వెక్కిరింతలూనూ?"

"హోరేబావా, నువ్వవతలికి పోరా కాస్సేపూ"

"బతికించావు"

3

"చెల్లీ!"

"ఎం-దు-క-న్న-య్యా?"

"అదేమిటమ్మా? శుభ మల్లే కూతురు తన మొగుడితో వెళ్లడం యేమిటి, నువ్వు కళ్లల్లో నీళ్లు పెట్టుకోడం యేమిటి? తప్పూ, తప్పూ, వూరుకో, వూరుకో"

"ఎం-త-ప-ని-జ-రి-గిం-ద-య్యా?"

"ఎప్పు డేది యెలా జరుగుతుందో మన కేం తెలుస్తుందమ్మా?.... అయినా యిదేనా బాగానే వుంది. నీ తప్పు నీ కూతురు దిద్దేసింది"

"కనిపెట్టలేకపోయా నయ్యా దాని తపనా! యెంత యిదీ కాకపోతే కార్యం కాకుండా మొగుడితో లేచిపోతుంది టయ్యా అయిన యింటి పడుచూ?"

"నిజమే"

"ఎంత బలగం వుందయ్యా దానికీ? గుమ్మానికి తోరణం కట్టుకున్నా మంటే వందమందికి తక్కువ వస్తారుటయ్యా నాయింటికి చుట్టాలూ? అలాంటిది యెవళ్లూ రాకుండా - చివరికి తల్లిపీను గేనా దగ్గర లేకుండా - యెంత వుసూరు మంటుందో నోయ్ వెర్రిపిల్లా!"

"....."

"వొక తలంటు లేకుండా, వొక కాళ్లు కడగడం లేకుండా - కొసకి మంగళహార తేనా లేకుండా అయ్యో! ఇంటికి పెద్దాడబడుచోయి తండ్రీ!"

"అవును మరి. నిజమే; కాని దాటిపోయాక యేం చేస్తాము?"

"ఇహ నే నుండలే నోయ్! నన్ను కూడా చెన్నాపట్టం తీసుకువెళ్లవూ? వూరుకుంటావేమయ్యా"

"సంవత్సరాని క్కాని కలగ దనుకున్న తొందర నీ కివాళే - ఈక్షణంలోనే కలుగుతోంది:'

"ఇంకా "కలుగుతోం" దేమిటి కలిగిందయ్యా! నా తండ్రివి కాదూ? తీసుకు వెళ్లవూ?"

"నే నో మాట చెబుతాను వింటావా?"

"ఏమి టన్నయ్యా అదీ?"

"నీకు కోపం వద్దు"

"ఇం కెక్కడి కోపమయ్యా కడుపు తరుక్కుపోతూ వుంటేనూ?"

"కాని, యిప్పుడు వెడితే నువ్వు లోకువైపోతావు"

"ఆడపిల్ల యెప్పుడు పుట్టిందో అప్పుడే లోకువైపోయాను. యిప్పుడు వచ్చిన విశేషం యేమిటయ్యా?"

"నిజంగా?"

"పుందుమీద కారం చల్లుతావా అన్నయ్యా?"

"నే నలాంటి వాణ్ణి?"

"కాదు, కాదు. ని న్నెర్గనూ నేనూ? దిక్కుమాలిన కర్మం తిక్క వస్తే తిప్పుకో లేనయ్యా నేనూ! అందుకు తగిన శాస్తి చేశాదయ్యా దేవుడూ"

"......"

"మాటాడ వేమయ్యా?"

"నా కేమీ తోచడం లేదమ్మా"

"నీకు తోచకపోతే నేను చెబుతాను వినవయ్యా"

"విని యేమిటి చెయ్యడం? నీ అల్లుడు వెనక్కి రాడు. నీ కూతుర్ని కూడా రానివ్వడు. అసలతను రానివ్వడం దాకా యెందుకూ, అదే రాదూ"

"వాళ్లు రావడం యెందుకయ్యా? మనమే వెడదాం అక్కడికి"

"వెడితే మాట్టాడకపోతే"

"నాకూతు రలాంటిది కాదోయ్!"

"వాడు?"

"పాపం మాట లెందుకూ? అత నేనా చాలా వోపిక కలవాడు; కాని తొందర మనిషికాడు"

"నవ్వు వస్తోంది నాకు"

"ఏం"

"ఇప్పుడే కాదుటమ్మా బందిపోటుదంగన్నావూ"

"వొళ్లు తెలవనప్పు డన్నా నామాట. ఇప్పుడు మణిపూస అని తోస్తోంది. కాకపోతే నా కూతుర్ని విడిచిపెట్టేసి మరొక పిల్లని - పిల్లలు దొరకరుటయ్యా అతగాడికీ? కురూపా, చదువు లేనివాడా, చేతగానివాడా?"

"అలాంటివాడికి యెంత ఆయాసం కలిగించావో యిప్పు డేనా తెలుస్తోందా?"

"......."

"ఇక నే నక్కస్సు పట్టలేను. వున్నమాట వున్న ట్టనేస్తాను"

"అనే సెయ్యి"

"ఇక్కడ నువ్వూ అక్కడ జోగన్నా చేశారిదంతాను"

"వియ్యపురాలు-"

"దా న్నన్న వాళ్లు పురుగు లోడి-"

"ఏం?"

"కట్నం కోసం పట్టు పట్టవద్దనీ, తనూ పిల్లలూ లాంఛనాలు వొదులుకుంటామనీ అపవాదలు పుడితే తీసేసుకో లేమనీ, కార్యం చేసేసి కోడల్ని తీసుకు రమ్మనీ శతవిధాల పోరుతోందది రోజూనూ; కాని జోగన్నే-"

"నిజం గాను టయ్యా?"

"చివరికి కొడుక్కి యీ వుపాయం చెప్పింది కూడా అదే అనుకుంటాను నేను"

"చూశావా? ఇంతకంటే దారి కనపడ లేదా యిల్లాలికి పాపం; కాని ఆవిణ్ణెంతలేసి మాట లన్నానయ్యా నేనూ?"

"దాన్ని పూసుకువచ్చా దని యిందాకా నీ మొగుణ్ణి కూడా యీసడించావు-"

"ఎంత పాపానికి వొడికట్టా నయ్యా నేనూ? ఇదెలా పోతుందయ్యా?"

"నువ్వే ఆలోచించు"

"వదిన కాళ్లమీద పడితే?"

"అదొక దారి"

"మరో దారెందుకూ యింకా? ఆవిడికి పెద్ద కొడుకూ నాకు పెద్దకూతురునూ. ఇద్దరూ దిక్కు లేనివాళ్లలాగ యెక్కడో చెన్నాపట్టంలో-"

"వాళ్లు కూడా యేదో పాపం చేసుకున్నారేమో వెనకటి జన్మలో?"

"మాకడుపుల్లో పుట్టడమే వాళ్లు చేసుకున్న పాపం. అన్నయ్యా! ఇక నేను నిలవలేను. నా నరాలు పట్టు తప్పిపోతున్నాయి. ముందు నన్ను తీసుకువెళ్లి జానకమ్మ వదిన కాళ్లమీద పడెయ్యవయ్యా"

"......"

"నాకు లేకుండా చేసుకోవడమే కాకుండా ఆవిడక్కూడా యీముచ్చట లేకుండా చేశాను నేను. పద వయ్యా. బతిమాలి ఆవిణ్ణీ పిల్లల్నీ కూడా తీసుకు వెడదామూ"

"ఈలోపునే - రేపు రాసిన ముహూర్తంవుంది. నీకూతురుకీ అల్లుడికీ తారాబలం కుదిరిం దేమో కూడానూ"

"అయ్యో, అయ్యో ఏం తొందర పడతారో యేమిటో?"

"వా డలాగ తొందరపడే వాడు కాడు. నీ కూతురే యే మేనా-"

"నన్ను సూదులతో పొడవక తంతి కొట్టెయ్యవయ్యా వెళ్లి. నాతండ్రివి కాదూ? నా నాయనవు కాదూ?"

"వెడతాను లే"

"ముందు వెళ్లాలి. అయితే మనం యెప్పుడూ వెళ్లడం?"

"నీకూతురూ అల్లుడూ వొంటిగంట పాసెంజరులో వెడుతున్నారు. మన మంతా రాత్రి మెయిలుకి వెడదాం. వాళ్లు పదిన్నరకి గాని చెన్నపట్నం వెళ్లలేరు. మనం యెనిమిదిన్నరకే వెడతాం. వెంటనే నేను బజారుకి వెళ్లి గంపెడు పూలదండలు తెస్తాను. రైలు దిగాటప్పటికి యెదురుగా వెళ్లి నీ కూతురుకీ అల్లుడికీ మెడ తిరక్కుండా అంతా తలోదండా వేద్దాం"

"ఏడుస్తూ వున్న దాన్ని నవ్విస్తా వోయ్ నువ్వూ"

"అయితే మంచిదే కాదూ?"

"మనం అలా చేస్తే నా వెర్రితల్లి యెంత సిగ్గుపడుతుందో పాపం!"

"అది సిగ్గున్న మనిషే అయితే పట్టపగలు లేచిపోతుంది టమ్మా?"

"మేనగోడల్ని ను వ్వేమన్నా అనతగ్గవాడవే. నువ్వు చేసే వుపకారానికి–"

"ఇంతకీ వారుకూడా రావాలి కదా?"

"మావదిన వస్తుం దయ్యా! ఆవిడ అలాంటి పెంకి మనిషి కాదు పాపం! కాళ్లమీద పడి నేను బతిమాలుకుంటాను కాదూ? తతిమ్మా యేర్పాటంతా నువ్వు చేస్తూ తొరగానూ"

"అన్నకాడికి యిచ్చెయ్యకుండా వాళ్లు–"

"ఇంకెందుకూ? యకరంనర భూమీ, మూడు వందల నలభై యెనిమిది రూపాయలూ, వాటి కైన ఫాయిదా–"

"అదిగదీ మాట"

"నాకు తెలవ దనుకున్నావా యేమి టయ్యా మంచీ చెడ్డానూ?"

"తీరా అంతా సిద్ధ మైనాక మీనాన్న–"

"వూరికే పేరు మట్టుకి మానాన్నది; కాని–"

"ఇదంతా నువ్వే చేస్తా?"

"దెప్పిపొడుస్తావా అన్నయ్యా?"

"లే దమ్మా లేదు, వూరికే తెలుసుకోడానికి–"

"తరవాత చెబుతా కాదూ అదంతానూ? ఇదిగో నేను వెళ్లి మా వదిన్ని బతిమాలుకుంటున్నాను. మీబావతో చెప్పి ప్రయాణం సిద్ధం చేయించు నువ్వు. పాలికాపుని రాయూరం పంపి జట్కాలు తెప్పించ మను ముందు"

"నంచున్న పళంగా యింత యెత్తు యెత్తితే యింత డబ్బు తేగలనా అంటాడేమో బావ?"

"నిన్న రాత్రే నయ్యా వొక రయితు తెచ్చి పదిహేను వందల యెనభై రూపాయలు గుమ్మరించాడు వాకట్లోనూ. అవన్నీ కర్చుపెట్టేస్తానిప్పుడు. వెళ్లేది చెన్నాపట్టం కనక అక్కడ ముద్దినుసు వస్తువులూ దొరుకుతాయి యించక్క"

"......."

"నవ్వు వస్తోందా అన్నయ్యా?"

"లేదమ్మా లేదు"

"నవ్వితే నవ్వావు; గానీ, యిదంతా చేసిపెడితివా మళ్లీ జన్మలో నీ కడుపున ఫుడతాను"

"ఇప్పుడు మాత్రం నాకు నువ్వు తక్కువ దానవా యేమిటి?"

"అవు నవును. నీ కలాంటి దయ వుంది కనకనే నా కిప్పు డిలాంటి సాయం చేస్తున్నావు నువ్వు"

"ఇదీ వొక దయలోనే లెక్కా?"

"అదంతా తరవాత మాట్టాడుకుందాం. పండుగు పేరు చెప్పి రావడంచేత సమయానికి మాపిల్లలూ, వారి పిల్లలూ కూడా యిక్కడే వున్నారు కంగారు అక్క ర్లేకుండానూ. ఇదిగో! సుందరమ్మ వొదిన్నీ పిల్లల్నీ కూడా తీసుకురాకపోతే నేను వొప్పుకోను సుమా"

"........"

"మాట్టాడ-తీసుకు వస్తా వన వేమయ్యా మరీ?"

"నీది వెఱ్ఱి కాదు, వేషమూ కాదూ"

"అదంతా నాకు తెలవదు-"

"ఇదంతా తలుచుకుంటే యెంత ఖర్చవుతుందో-"

"సమయం వస్తే వెనక్కి తీస్తానుటయ్యా? ఇంతకీ: వుభయఖర్చులూ నేనే పెట్టుకుంటానుసుమా"

"అయినా, వాళ్లు కూడా యెందు కమ్మా యిప్పుడూ?"

"పెళ్లి ముచ్చట్లూ, శోభనపు ముచ్చట్లూ వొక్క మాటే తీరాలి కాదుటయ్యా మరీ?"

(ప్రబుద్ధాంధ్ర - మార్చి, 1935)